సాక్షి
విశాఖపట్నం
గురువారం । 16 । మే । 2024



భువనేశ్వర్-యల్లహంక సమ్మర్ స్పెషల్ 10లో



మామి'డీలా'! 10లో



రోప్ స్కిప్పింగ్‌లో 'మేరీ'సింది 10లో

న్యూస్‌రీల్

నేటి నుంచి చందనం విక్రయాలు



సింహాచలం: చందనోత్సవం రోజు వరాహ లక్ష్మీనృసింహస్వామి నుంచి స్వీకరించిన చందనాన్ని ఈ నెల 16, 17, 19, 20, 21 తేదీల్లో విక్రయిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10కి విక్రయిస్తామన్నారు. సింహగిరిపై ప్రసాదాల విక్రయశాల వద్ద ఉదయం ప్యాకెట్ల విక్రయం ఉంటుందని, భక్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

డయల్ యువర్ సీపీకి 22 ఫిర్యాదులు



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ : డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులపై దృష్టి పెట్టి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీపీ తన చాంబర్ నుంచి డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి 22 మంది కాలర్స్ ఫోన్ చేసి తమ సమస్యలు, ఫిర్యాదులను సీపీకి విన్నవించుకున్నారు. అలాగే మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు వృద్ధుల కోసం కేటాయించిన సమయంలో ఏడుగురు వృద్ధులు ఫోన్ చేసి పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. సీపీ రవిశంకర్ వాటిపై వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విషయంపై దృష్టి సారించాలని చెప్పారు.

ఏయూ ఈఈటీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూ ఈఈటీ 2024 ప్రవేశాల కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. రక్షణ రంగ ఉద్యోగులు, దివ్యాంగుల విభాగాల వారికి ఈ నెల 17న ప్రత్యక్షంగా సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతారు. ఎన్‌సీసీ, క్రీడా విభాగాల వారు తమ సర్టిఫికెట్లను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని, ఇతర విభాగాల విద్యార్థులు ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ. నాయుడు సూచించారు. ఈ నెల 25 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తొలిదశ సీట్ల కేటాయింపు జూన్ 1వ తేదీన నిర్వహిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గురుకులాల్లో ఇంటర్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ సీట్ల భర్తీకి ఈ నెల 16, 17 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలో 3 గురుకులాలు, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించారు. బాలురకు 183 సీట్లు కేటాయించగా.. శ్రీకృష్ణాపురం, దేవరాపల్లిలో ఎంపీసీ/బైపీసీ, సబ్బవరం, గొలుగొండలో ఎంఈసీ/సీఈసీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బాలికలకు 183 సీట్లు కేటాయించగా.. మధురవాడ, మేహాద్రిగెడ్డ, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, కోనాంలో ఎంపీసీ/బైపీసీ గ్రూపులకు ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు స్వల్ప అస్వస్థత

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం విధి నిర్వహణలో ఉండగా డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు గుండెనొప్పి వచ్చింది. కేజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స కోసం కేర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ కోలుకుంటున్నారు. గతంలో ఆయనకు గుండెనొప్పి రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కొద్ది రోజుల విశ్రాంతి తర్వాత తిరిగి విధుల్లో చేరారు. మళ్లీ ఇప్పుడు అస్వస్థతకు గురి కావడంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డిప్యూటీ సూపరిండెంటెంట్ డాక్టర్ రాధాకృష్ణ బాధ్యతలు చేపట్టారు.

హలో.. ఏంటి పరిస్థితి!

- పార్టీ, అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఆరా
- ఎక్కడ చూసినా ఇదే చర్చ
- కూడికలు, తీసివేతల్లో శ్రేణుల నిమగ్నం
- లెక్కలు, అంచనాల్లో తలమునకలు



సాక్షి, విశాఖపట్నం: హలో.. అప్పారావ్!.. నేను రాజుబాబుని మాట్లాడుతున్నాను. ఏంటి పరిస్థితి? మీ దగ్గర ఎవరు గెలుస్తారు? ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుందనుకుంటున్నారు? అవతల పార్టీ అభ్యర్థికి ఎన్ని పడుంటాయ్? అయితే మన పార్టీ కేండిడేట్ గెలుపు గ్యారంటీ అన్న మాట! అది సరే.. స్టేట్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటున్నారు? నీకున్న సమాచారం ఓ సారి చెప్పు!' అని అడిగే సరికి ఆ రాజుబాబు తనకు తెలిసినవి కొన్ని, తెలియనివి మరికొన్నింటిని జోడించి అక్కడ వాళ్లు గెలుస్తున్నారు.. ఇక్కడ వీళ్లు గెలుస్తున్నారంటూ టకటకా చెప్పేస్తున్నాడు. మధ్యమధ్యలో అప్పారావుకొచ్చిన డౌట్‌లను నివృత్తి చేస్తూ ఫలితాలను ముందే ప్రకటిస్తున్నాడు. ఇలాంటి అప్పారావులు, రాజుబాబుల్లాంటి వారు చాలామంది ఈ పనిమీదే ఉన్నారు. ఎక్కడ చూసినా ఇలాంటి చర్చలే సాగిస్తున్నారు. పోలింగ్ ముగిశాక అభ్యర్థులు, పార్టీల గెలుపోటములపైనే అందరి దృష్టి ఉంది. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ కనిపిస్తోంది.

అంతేకాదు.. ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం తమ స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేసి ఎన్నికల ఫలితాలెలా ఉంటాయన్న దానిపైనే మాట్లాడుకుంటున్నారు. సాధారణ ప్రజలకంటే ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు వీటిపైనే చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పోలై ఉంటాయి? వాటిలో గెలుపు అంశాలు ఎంతవరకు ఉంటాయన్న దానిపై బేరీజు వేస్తున్నారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, యువతీ యువకులు ఎవరికి వేశారోనని ఆరా తీస్తున్నారు. దానిని బట్టి ఫలానా అభ్యర్థి/పార్టీ గెలుస్తుందని, లేదా ఓటమి పాలవుతారని అంచనాకొస్తున్నారు. ఇలా కూడికలు, తీసివేతల్లో నిమగ్నమై ఉన్నారు. లెక్కలు, అంచనాల్లో తలమునకలై ఉన్నారు. మరోవైపు టీవీల్లోను, సోషల్ మీడియాలోను, యూట్యూబ్ ఛానల్స్‌లోనూ ఇప్పటికే అనధికారికంగా ఎగ్జిట్ పోల్స్ పేరిట ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయన్నది జోస్యం చెప్పేస్తున్నారు. ఆయా పార్టీల శ్రేణులు, రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారు వీటిని ఎక్కువగా వీక్షిస్తున్నారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్‌లో ఈ ఎన్నికల్లో తమదే శాస్త్రీయమైన సర్వే అని చెప్పుకుంటూ తమ అభిమాన పార్టీకి అనుకూలంగా ఫలితాలను ఇస్తున్నారు. మరికొందరైతే అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూల ఫలితాలనే కూటమికి వస్తున్నట్టు తారుమారుగా చూపిస్తున్నారు. ఇలా సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వ(ఇ)స్తున్న అనధికార అంచనా ఫలితాలు జనాన్ని గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. దీంతో తమ నమ్మకస్తులకు ఫోన్లు చేసి సందేహ నివృత్తి చేసుకుని ఒకింత ఊరట చెందుతున్నారు. వ్యతిరేక ఫలితాలు వస్తాయన్న సంగతి తెలిస్తే ఆందోళనకు గురవుతున్నారు. టీవీలు, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వస్తున్న సొంత అంచనాల ఫలితాలతో ఇప్పటికే బెట్టింగులకు దిగిన వారు మరింత టెన్షన్ పడుతున్నారు.

బెట్టింగులపై కూటమిలో బెరుకు..

మరోవైపు పోలింగ్‌కు ముందు కూటమి అభ్యర్థులదే గెలుపంటూ పందాల కోసం హడావుడి చేసిన వారు ఇప్పుడు వెనక్కి తగ్గారు. తొలుత 1:2,3 బెట్టింగులకు సిద్ధమన్న వారిప్పుడు 1:1కి కూడా ముందుకు రావడం లేదు. ఏదోలా తామే అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్నా.. పందాల దగ్గరకు వచ్చే సరికి పలాయనం చిత్తగిస్తున్నారు. మొత్తమ్మీద అసలు ఫలితాలు వెలువడే జూన్ నాలుగో తేదీ వరకు ఇలాంటి ఊహాగానాలకు తెరపడే అవకాశం లేదు.

పెరిగిన పోలింగ్

ఫలించిన జిల్లా యంత్రాంగం కృషి

మహారాణిపేట: పోలింగ్ శాతం పెంచడం కోసం **జిల్లా యంత్రాం**గం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫ**లితాలనిచ్చాయి**. కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆర్వోలు, బీఎల్వోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా చేర్పించారు. వారికి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా స్థాయితోపాటు నియోజకవర్గాల వారీగా విభిన్న కార్యక్రమాలు చేపట్టి ఓటర్లను చైతన్య పరిచినట్టు కలెక్టర్ తెలిపారు. అందుకే 2019 ఎన్నికల్లో కంటే 2024లో పోలింగ్ శాతం గణనీయమంగా పెరిగింది. జిల్లాలో ఈ నెల 13న 1991 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. 2019లో మొత్తం 18,81,678 మంది ఓటర్లు ఉండగా.. 12,46,529 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 66.25 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో మొత్తం 20,12,373 మంది ఓటర్లకు గానూ 14,09,116 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70.03 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చి చూస్తే 3.78 శాతం పోలింగ్ పెరిగింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 11.60 శాతం పెరిగినట్లు గణంకాలు చెబుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతీ ఒక్కరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గం	2024 పోలింగ్ శాతం	2019 పోలింగ్ శాతం	వ్యత్యాసం
భీమిలి	75.96	73.90	2.06
విశాఖ తూర్పు	68.64	64.73	3.91
విశాఖ దక్షిణ	63.42	61.15	2.27
విశాఖ ఉత్తర	64.63	62.85	1.78
విశాఖ పశ్చిమ	69.78	58.19	11.60
గాజువాక	69.83	65.33	4.49
పెందుర్తి	74.44	74.72	0.28

19న విద్యార్థులకు జూలో పోటీలు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 19న ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థులకు జీవ వైవిధ్య పరిరక్షణపై పోటీలతోపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందని సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు జాతీయ స్థాయి వేడుకలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు జీవవైవిధ్యంపై అవగాహనతో పాటు పోటీలు నిర్వహించనున్నామన్నారు. జూ బయోస్కోప్‌లో 19న ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 78936 32900 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆ రోజు విద్యార్థులకు జూలో ఉచిత ప్రవేశం ఉంటున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు వ్యాసరచన, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు చిత్రలేఖనం, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటలు వరకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు బ్యాచ్‌లుగా విడదీస్తున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియా గప్‌చుప్

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్నాళ్లుగా ఉధృత ప్రచారం
- సినిమాలు, ఐపీఎల్‌ను తలదన్నేలా రీల్స్, వీడియోలు
- ఎన్నికలు ముగియడంతో నిశ్శబ్దమైన ఆన్‌లైన్ యాప్స్



సాక్షి, విశాఖపట్నం: సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలపై పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంత వరకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది. సోమవారం ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్ కాస్టింగ్ కాల్స్, ఇన్‌స్టా రీల్స్, ఎక్స్ పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్ ప్రచారం గప్‌చుప్ అయిపోయింది.

ఈసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా ప్రచారం కీలక పాత్ర పోషించింది. ఒకానొక క్రమంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికెట్ మానియాను సైతం తలదన్నేలా డిజిటల్ ప్రచారం కొనసాగింది. ఒక్క పోస్ట్, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర ఇంటర్నెట్ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. వివిధ పార్టీలు, ఆయా అభ్యర్థులు ప్రైవేట్ పాటల ఆల్బమ్‌లను రూపొందించి వాటిని సోషల్ మీడియా ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రసారం చేశారు. ఎలాగైనా సరే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాలి, ఓటర్లను ఆకర్షించాలనే నినాదం ప్రచారాన్ని జోరెక్కించారు. సోషల్ మీడియా ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకంగా టెక్నికల్ టీంను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొంత మంది అవాస్తవాలను, దుష్ప్రచారాలకు తెరలేపారు. వ్యూస్ కోసం, వైరల్ మారడం కోసం అనవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన ఘటనలూ లేకపోలేదు. ఏదేమైనా పోలింగ్ ముగియడంతో సోషల్ మీడియాలో పోస్టులు తగ్గిపోయాయి. అక్కడక్కడా ఆయా పార్టీల శ్రేణులు లెక్కలు, అంచనాలతో పోస్టులు పెడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

దుశ్శాసన పర్వం



రాత్రి వేళ జుత్తు పట్టుకొని లాక్కొచ్చారు.. కాళ్లతో తన్నుకుంటూ.. తాకరాని చోట తాకుతూ.. దుస్తులు చింపేశారు. అడ్డు వచ్చిన వారిని గాయపరిచారు. ఫోన్లు, ఒంటిపైనున్న బంగారు వస్తువులు లాక్కెళ్లారు. నర్సీపట్నంలో ఒంటరి మహిళపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అనుచరులు జరిపిన దాష్టీకమిది. వలంటీర్‌గా సేవలందించడమే ఆమె చేసిన పాపమట.. వలంటీర్ వ్యవస్థను ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడంతో రాజీనామా చేయడమే ఆమె తప్పట.. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేయడమే ఆమె దోషమట.. అందుకే దుశ్శాశనుల్లా ఆమెను ఈడ్చుకొచ్చారు. వివస్త్రను చేశారు. ఈ ఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తల దించుకుంది. గాంధీ గారి దేశంలో గజానికో గాంధారి కొడుకు తయారయ్యాడని.. వారికి అడ్డుకట్ట వేసేందుకు దశ 'దిశ' నిర్దేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నా.. ఆయన ఆశయాల కోసం పనిచేస్తున్నవారన్నా ఎందుకంత కక్ష, కార్పణ్యం అని ప్రశ్నిస్తోంది.

- నర్సీపట్నంలో పచ్చ మూకల అమానుషం
- పూర్వ మహిళా వలంటీర్‌పై పాశవికంగా దాడి
- జుత్తుపట్టుకొని లాక్కొచ్చి, దుస్తులు చించేసిన అయ్యన్న అనుచరులు
- ఎన్నికల్లో చురుగ్గా పనిచేశారన్న కోపంతో దుశ్చర్య
- నిందితులు రెడ్డిసాయి, రెడ్డి రాజేష్, గంగాధర్‌లపై పోలీసులకు ఫిర్యాదు
- ఏరియా ఆస్పత్రిలో బాధితురాలికి వైద్యం

విశాఖ సిటీ : వలంటీర్లంటే వారికి ఒళ్లు మంట. సేవలతో ప్రజలకు దగ్గరవుతున్నారని, సీఎం జగన్ ప్రతినిధులుగా ప్రజలు వారిని ప్రేమిస్తున్నారని ద్వేషం. వారి వల్ల రాజకీయంగా తాము బలహీన పడుతున్నామని కడుపు మంట. అందులో మహిళా వలంటీరంటే మరింత చులకన. అందుకే నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో పూర్వ వలంటీర్ పాలమూరి రాజకుమారిపై మంగళవారం రాత్రి అయ్యన్నపాత్రుడి అనుచరులు కీచకపర్వానికి తెగబడ్డారు. రాజకుమారికి భర్త లేదు. 13 ఏళ్ల కుమారుడితో ఆమె ఒంటరిగా జీవిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్‌గా చేరారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా మనసారా సేవలందించారు. చంద్రబాబు అండ్ కో ఫిర్యాదులతో వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరం పెట్టమన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మనస్తాపం చెంది రాజీనామా చేశారు. ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించారు. పోలింగ్ రోజున ఓటర్లకు స్లిప్‌లు రాసిచ్చి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేయడం టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడి అనుచరులకు మింగుడు పడలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ అనుచరులు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి శివ, సుకల రాజేష్‌తో పాటు మరికొందరు రాజకుమారిని టార్గెట్ చేశారు.

తప్పిన ప్రాణాపాయం

పోలింగ్ మరుసటి రోజు మంగళవారం రాత్రి రాజకుమారి పడుకునేందుకు తన 13 ఏళ్ల కుమారుడిని వెంట పెట్టుకొని అదే గ్రామంలో ఉన్న అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. రాత్రి 10 గంటల సమయంలో టీడీపీ మూకలు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యసాయి, కామిరెడ్డి శివ, సుకల రాజేష్, పెట్ల గంగాధర్, అల్లు రాజు, వానపల్లి రాజేష్, సార్ల రఘు, నందిపల్లి బోయిల నాయుడు వారి ఇంటి మీదకు ఎగబడ్డారు. రాజకుమారిపై దాడి చేశారు. వారి చర్యలను ఆమె సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు ప్రయత్నించడంతో ఆమె చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని జుట్టు పట్టుకొని బయటకు లాక్కొచ్చారు. ఛాతి మీద చేయి వేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. ఆమె ఒంటి మీద బట్టలను చించేసి వివస్త్రను చేశారు. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. రాజకుమారిపై దాడిని అడ్డుకోవడానికి స్థానిక యువకులు, మహిళలు ప్రయత్నించారు. టీడీపీ నేతలు వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో ఒమ్మి గోవింద, గజ్జల గోపీచంద్, వియ్యపు వరహాలు, గుమ్మిడి సీతమ్మలకు కూడా గాయాలయ్యాయి. రాజకుమారిని రక్షించడానికి ప్రయత్నించిన వృద్ధురాలు సీతమ్మ చెంపపై గట్టిగా కొట్టి ఆమె బంగారు చెవి దుద్దులు లాక్కొని వెళ్లిపోయారు. ఒంటరిగా ఉంటే చంపేసేవారని, అమ్మ వాళ్ల ఇంటి వద్ద ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డానని రాజకుమారి చెప్పారు. ఈ ఘటనపై ఆమె నర్సీపట్నం రూరల్ పోసులకు ఫిర్యాదు చేసి, తనకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు దాడికి పాల్పడిన వారిపై 324, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నేటి నుంచి బీసీజీ టీకా

మూడు నెలల పాటు అన్ని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో కార్యక్రమం



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల గౌరీ

మహారాణిపేట : క్షయ నివారణకు రూపొందించిన బీసీజీ టీకాను గురువారం నుంచి మూడు నెలల పాటు వేయాలని నిర్ణయించినట్టు వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నిర్మలగౌరీ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన ప్రోగ్రామ్ అధికారులు, ఇతర వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. పైలెట్ ప్రాజెక్టుగా దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో ఈ టీకాను అమలు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాల్లో అమలు చేస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగాకు వాడుతున్న వారు, టీబీ సోకిన వారు, 60 సంవత్సరాలు దాటిన వారంతా వేసుకోవాలన్నారు. టీకా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో గురువారం నుంచి బీసీజీ టీకా ప్రజలకు ఉచితంగా వేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి పాల్గొన్నారు.

ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీకి అభినందనలు



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ, చిత్రంలో సంస్థ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసిన వుమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ బృందానికి విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ అభినందనలు తెలిపారు. బొత్స ఝాన్సీ ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న వుయ్ సపోర్ట్ ఆధ్వర్యంలో టీఎస్ఎన్ కాలనీలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆమె మాట్లాడారు. గోరింటాకు శుభసూచకమని, తన విజయానికి సూచనగా సొసైటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి మహిళలకు గోరింటాకు అలంకరించడం ప్రశంసనీయమన్నారు. ఇటువంటి సంస్థకు తన సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆమె తెలిపారు. సొసైటీ సీఈవో మల్లాది నారాయణమూర్తి మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆడపిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణనిచ్చి, ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మహిళలకు మెహందీలో శిక్షణ ఇచ్చి, ఎన్నికల ప్రచారంలో భాగంగా బొత్స ఝాన్సీ తరఫున 45రోజుల పాటు సుమారు 400మంది మహిళలతో ఈ బృహత్తర ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశామన్నారు. భవిష్యత్తులోనూ కమర్షియల్ ప్రాజెక్టులను చేపట్టి, మహిళలకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, సొసైటీ సెక్రటరీ శ్రీలక్ష్మి, డైరెక్టర్లు కె.కృష్ణవేణి, రూప, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: దివ్యాంగుల ఫిర్యాదులపై దృష్టి పెట్టి తక్షణమే వాటిని పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక స్పందనలో భాగంగా దివ్యాంగ సురక్ష టోల్‌ఫ్రీ నెంబర్‌కు నలుగురు కాలర్స్ ఫోన్ చేశారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఇద్దరు ఇతర రాష్ట్రాల నుంచి ఫోన్ చేసి సీపీకి తన సమస్యలు విన్నవించుకున్నారు. వీటిపై తక్షణమే సంబంధిత ప్రాంతాల అధికారులకు ఈ సమస్యలను రాత పూర్వకంగా పోస్టల్, వాట్సప్ ద్వారా అందజేసి, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని దిశా దివ్యాంగ సురక్ష కంట్రోల్, ఇతర సిబ్బందిని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా నియమించిన ఇన్‌స్పెక్టర్‌ను సీపీ ఆదేశించారు. గత సారి నిర్వహించిన ఈ కార్యక్రమానికి వచ్చిన 8 ఫిర్యాదుల్లో ఆరింటిని పరిష్కరించారు. మరో రెండు కూడా పరిష్కార దశలో ఉన్నాయి.

రోప్ స్కిప్పింగ్‌లో ‘మేరీ’సింది

- అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన పేదింటి బిడ్డ
- రెండు బంగారు పతకాలు సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థిని


స్కిప్పింగ్ చేస్తున్న మేరీ


తల్లిదండ్రులతో మేరీ


మేరీ సాధించిన పతకాలు


మేరీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, ఇతర అధ్యాపకులు

మురళీనగర్: నగరానికి చెందిన ఓ పేదింటి బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌గా నిలిచి విశాఖ కీర్తి పతాకను ఎగురవేసింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మెటలర్జికల్ విభాగంలో సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ఎస్.మేరీ సౌత్ ఏసియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో దేశం తరపున హాజరై ప్రతిభ చూపింది. ఈ పోటీల్లో రెండు బంగారు పతకాలను సాధించి సత్తా చాటింది. ఆడపిల్లలు సరదాగా ఆడుకునే రోప్ స్కిప్పింగ్‌నే తన క్రీడగా ఎంచుకుని ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఆమె తండ్రి రామస్వామి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రేణుక గృహిణి.

అసాధారణ ప్రతిభ

మేరీ సరదాగా నేర్చుకున్న రోప్ స్కిప్పింగ్‌లో వేగాన్ని గమనించిన పాలిటెక్నిక్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్‌బేగ్‌తో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెటర్జికల్ హెడ్ రత్నకుమార్, ఇతర విభాగాధిపతులు ఆమెను ప్రోత్సహించారు. నేపాల్‌లోని ఖాట్మండులో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన సౌత్ ఏసియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొంది. 17 ఏళ్ల దాటిన విభాగంలో మూడు నిమిషాల ఎన్డ్యూరెన్స్ మహిళ విభాగంలో 382 స్కోరు చేసి గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే 30 సెకన్ల డబుల్ అండర్ మహిళా విభాగంలో 82 స్కోర్ చేసి మరో బంగారు పతకాన్ని సాధించి దేశ కీర్తి ప్రతిష్టలు పెంచింది. దక్షిణాసియా నుంచి ఏడు దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో ఎస్.మేరీ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించింది. మేరీ రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానం సాధించగా.. బంగ్లాదేశ్‌కు చెందిన మహిళ ద్వితీయ స్థానం, పాకిస్తాన్‌కు చెందిన మహిళ తృతీయ స్థానంలో నిలిచారు. కాగా.. ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఢిల్లీలోని తాల్కటోర స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్ పోటీల్లోనూ మేరీ సత్తా చాటింది. 3 నిమిషాల ఎన్డ్యూరెన్స్ విభాగంలో 384 స్కోర్, 30 సెకన్ల డబుల్ అండర్ విభాగంలో 82 స్కోర్ చేసి బంగారు పతకాలు సాధించింది.

అభినందనల వెల్లువ

బంగారు పతకాలు సాధించిన మేరీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాలిటెక్నిక్ కళాశాలకు బుధవారం ఆమె వచ్చిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రత్నకుమార్, పీడీ అబ్బాస్ బేగ్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు ఆమె ను ఘనంగా సత్కరించారు. కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన మేరీకి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్ నారాయణరావు, మెటలర్జికల్ విభాగాధిపతి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్, మెటలర్జికల్ విభాగాధిపతి, పీడీ, ఇతర విభాగాల అధిపతులు, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఘనత సాధించగలిగానని మేరీ తెలిపారు. ఆమెకు కోచ్‌గా ఎస్.సాగర్ వ్యవహరిస్తుండగా.. ఇప్పటివరకు మేరీ 25 పతకాలు సాధించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గుమ్మడి మధు(ఫైల్)


మధు మృతదేహం

పీఎంపాలెం: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధాన గేటుకు ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీనియర్ నాయకుడు గుమ్మడి మధుసూదనరావు(55) దుర్మరణం చెందాడు. సాయంత్రం 4 గంటల సమయంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 5వ వార్డులోని సాయిరామ్‌కాలనీలో నివసిస్తున్న గుమ్మడి మధుసూదనరావు సీనియర్ రాజకీయ నాయకుడిగా ఈ ప్రాంత వాసులకు చిరపరిచితుడు. ఆయనకు భార్యతో పాటు పెళ్లయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదట్లో కాంగ్రెస్‌లో కొనసాగిన మధు ఆ తర్వాత వైఎస్సార్ సీపీ, టీడీపీలో పనిచేశారు. వ్యక్తిగత కారణాలతో కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. హీరో వెంకటేష్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన పనిచేశారు. జాతీయ రహదారిపై నగరం నుంచి ఆనందపురం వైపు ద్విచక్రవాహనంపై ఆయన ప్రయాణిస్తుండగా.. వెనుకనే వస్తున్న లారీ అతన్ని ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని కుమారుడు మనోజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. గుమ్మడి మధు ఆకస్మిక మృతితో సాయిరామ్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక దుర్గాలమ్మ ఆలయ నిర్మాణకర్తగా గుర్తింపు పొందిన గుమ్మడి మధు మృతి పట్ల ఈ ప్రాంతవాసులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వివాహిత బలవన్మరణం

పీఎంపాలెం: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. మధురవాడ అమరావతి కాలనీ బ్లాక్ నంబర్ 10 ఎఫ్ఎఫ్-1 లో విత్తనాల సత్యవేణి(36), భర్త శ్రీనివాస్ నివసిస్తున్నారు. పదేళ్ల కిందట వీరికి వివాహం అయింది. అయితే సంతానం లేదు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శ్రీనివాస్ బుధవారం ఉదయం 9 గంటలకు బయటకు వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. భార్య ఇంటి వద్ద లేక పోవడంతో పలుమార్లు ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండగా.. ఇంటి తలుపునకు లోపల గడియ పెట్టి ఉంది. దీంతో అనుమానం వచ్చిన ఆయనకు చుట్టు పక్కల వారితో కలిసి తలుపులు బద్దలగొట్టాడు. ఇంట్లోకి ప్రవేశించి చూడగా సత్యవేణి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయింది. అదే కాలనీలో నివసిస్తున్న అత్తమామలు, పోలీసులకు ఈ విషయం తెలిపాడు. మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లి యల్ల నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రామిక్ యూనియన్ కో-ఆర్డినేటర్‌గా రామ్మోహనరావు


డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను కలిసిన రామ్మోహనరావు, పి.కె.పట్నహాని

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేర్ డివిజన్ డివిజనల్ కో-ఆర్డినేటర్‌గా పప్పల రామ్మోహనరావు ఎంపికయ్యారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడడంతో శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె. పట్నహాని నాయకత్వంలో బుధవారం వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన రామ్మోహనరావు, జోనల్ అధ్యక్షుడు పి.వి.జె రాజు, డిప్యూటీ డివిజనల్ కో-ఆర్డినేటర్ చందన్ కుమార్‌లను పట్నహాని డీఆర్ఎంకు పరిచయం చేశారు. కార్మిక సమస్యలను పరిష్కరించడంలో, రైల్వే ప్రగతిలో రైల్వేకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని పట్నహాని తెలిపారు. రామ్మోహనరావు 2018లో శ్రామిక్ కాంగ్రెస్ డివిజనల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. ఇప్పుడు రైల్వేలో గుర్తింపు కలిగిన అతి పెద్ద కార్మిక ఫెడరేషన్ అయిన ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) అనుబంధ సంస్థ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్‌లో కో-ఆర్డినేటర్ పదవి చేపట్టారు. రెండున్నర దశాబ్దాలుగా కార్మికుల కోసం ఆయన రాజీలేని పోరాటం చేస్తూ, పలు సామాజిక కార్యక్రమాల్లో ముందున్నారు. సహచరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భువనేశ్వర్-యల్లహంక సమ్మర్ స్పెషల్

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉన్నందున భువనేశ్వర్-యల్లహంక-భువనేశ్వర్ మధ్య (వయా దువ్వాడ మీదుగా) సమ్మర్ స్పెషల్స్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-యల్లహంక(02811) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారాలలో భువనేశ్వర్‌లో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.55 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.55 గంటలకు యల్లహంక చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో యల్లహంక-భువనేశ్వర్(02812) సమ్మర్ స్పెషల్ ప్రతీ సోమవారాలలో యల్లహంకలో ఉదయం 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది.

అక్కడ నుంచి 4.32 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.15గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 3వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తాయి. ఈ స్పెషల్ రైళ్లు 16-థర్డ్ ఏసీ, 2-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

రోడ్డు ప్రమాదంలో విశాఖ వాసికి గాయాలు

రాజమండ్రి వాసి దుర్మరణం

చౌటుప్పల్: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి ఇద్దరు స్నేహితులు బైక్‌పై సొంతూర్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం స్టేజీ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన కొనికల్ల దీపక్ రాజ్(29), విశాఖపట్టణానికి చెందిన అనిరుధ్ స్నేహితులు. వీరిద్దరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అద్దె ఇంట్లో ఉంటూ అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకుగాను బస్సులో స్వగ్రామాలకు వెళ్లేందుకు వారు ప్రయత్నించారు. కానీ టికెట్లు దొరక్కపోవడంతో బైక్‌పై వెళ్లారు. ఓటేసి బుధవారం తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై ఆగిన కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దీపక్‌రాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. అనిరుధ్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదవరెడ్డి తెలిపారు.

పొల్లూరులో పుష్ప-2 షూటింగ్ సందడి


షూటింగ్ కోసం ఏర్పాటు చేసిన సెట్

మోతుగూడెం: పొల్లూరు పరిసర ప్రాంతాల్లో పుష్ప-2 సినిమా షూటింగ్ చిత్రీకరణ సందడి నెలకొంది. దీనిలో భాగంగా బుధవారం పొల్లూరులో దుర్గా మల్లేశ్వరి ఆలయం వద్ద ఎస్టీడీ బూత్, మార్కెట్, పరిసరాల్లో గుడిసెలు ఏర్పాటుచేశారు. వీటి వద్ద కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానికంగా సుమారు 300 మంది యువకులకు కొన్ని సన్నివేశాల్లో అవకాశం కల్పించారు. గురువారం పొల్లూరు పిక్నిక్ స్పాట్ వద్ద చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. నటీ నటులను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

227 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు

నక్కపల్లి: మనబడి నాడు నేడు ఫేజ్ 2లో పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యంపై రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నాడు నేడు కింద మౌలిక సదుపాయాల కల్పనలో జరుగుతున్న జాప్యానికి బాధ్యులైన 227 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర కమిషనర్ సూచనల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు నేడు ఫేజ్ 2 కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతులతోపాటు, మరుగుదొడ్లు, వంట షెడ్లు, తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఈ పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి కాలేదు. గత ఏడాది చివరలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సైతం జిల్లాలో విస్తృతంగా పర్యటించి అసంపూర్తిగా ఉన్న పనులను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులు, డీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంల బ్యాంకు ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ పనులు చేయకుండా జాప్యం చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. హెచ్ఎంలతో పాటు ఇంజనీరింగ్ అధికారులపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు బాధ్యులైన హెచ్ఎంలపై కొరడా ఝళిపించారు. షోకాజ్ నోటీసులు జారీ అయిన వారిలో అనకాపల్లి మండలంలో 23 మంది, అచ్యుతాపురం మండలంలో 9 మంది, బుచ్చెయ్యపేటలో 6, చీడికాడలో 6, చోడవరంలో 15, దేవరాపల్లిలో ముగ్గురు, గొలుగొండలో 5, కె.కోటపాడులో 5, కశింకోటలో 6, కోటవురట్లలో 1, మాకవరపాలెంలో 9, మునగపాకలో 4, నక్కపల్లిలో 12, నర్సీపట్నంలో 21, నాతవరంలో 8, పరవాడలో 7, పాయకరావుపేటలో 24, రాంబిల్లిలో 9, రావికమతంలో 13, రోలుగుంటలో 5, ఎస్.రాయవరం మండలంలో 11, సబ్బవరం మండలంలో ఒకరు, వి మాడుగులలో ఐదుగురు, యలమంచిలి మండలంలో 14 మంది హెచ్ఎంలు ఉన్నారు. అలాగే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ (07036) సమ్మర్ స్పెషల్, సంత్రగచ్చి - చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ ఆలస్యంగా బయలుదేరాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట : నరసింగబిల్లి-యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాల ప్రకారం .. విజయవాడ-అనకాపల్లి మార్గంలో నరసింగబిల్లి వద్ద గుర్తు తెలియని రైలు నుంచి ఒక వ్యక్తి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నేరేడు పండు రంగుపై పచ్చ రంగు నిలువు చారల చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,250
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,150
వెండి(కిలో):	రూ.91,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.135
బ్రాయిలర్ (లైవ్)	: రూ.155
స్కిన్	: రూ.280
స్కిన్‌లెస్	: రూ.290

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడి దిగుబడి ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. ఆశించిన ధర ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. మరో వైపు మామిడి రాకపోవడంతో కమీషన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరు వరకు మామిడి సీజన్ ఉంటుంది. డిసెంబరు నాటికి పూత రావాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కూడా రాలేదు. దీంతో మామిడి పంట దిగుబడి తగ్గింది. రైతులతో పాటు, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టే కమీషన్ వ్యాపారులు కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.


ఎగుమతికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

- ఈ ఏడాది గణనీయంగా తగ్గిన దిగుబడి
- ధర ఉన్నా.. ఫలితం శూన్యం
- వెలవెలబోతున్న కమీషన్ దుకాణాలు

మామిడీలా..!


చినదొడ్డిగల్లు వద్ద ఏర్పాటు చేసిన కమీషన్ దుకాణం

నక్కపల్లి :

గ్రామీణ జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన ఏటా సుమారు 2 లక్షల టన్నుల దిగుబడి రావాలి. ఉద్యానవన శాఖాధికారులు మాత్రం 75 నుంచి 80 శాతం దిగుబడినే పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లాలో మామిడి సాగులో పాయకరావుపేట నియోజకవర్గానిదే అగ్రస్థానం. నక్కపల్లి మండలంలో 10 వేల ఎకరాలు, కోటవురట్ల మండలంలో 7 వేల ఎకరాలు, పాయకరావుపేట మండలంలో 4 వేల ఎకరాలు, ఎస్.రాయవరం మండలంలో 6 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. తర్వాత పద్మనాభం మండలంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. నాతవరం, కొయ్యూరు, నర్సీపట్నం, గొలుగొండ, యలమంచిలి, రాంబిల్లి, మాడుగుల, కోటపాడు, చోడవరం మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో మామిడి పండిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా నుంచి లక్ష టన్నుల పైనే ఎగుమతి జరిగేది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సగానికి సగం దిగుబడి పడిపోయిందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. సీజన్ పూర్తయ్యే నాటికి 50 వేల టన్నుల ఎగుమతి చేయడం కష్టమేనని అంటున్నారు.

హైవే పక్కనే కమిషన్ దుకాణాలు

జిల్లాలోనే మామిడి సాగులో అగ్రస్థానంలో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ రహదారి పక్కన కమీషన్ దుకాణాలు ఎక్కువగా ఏర్పాటు చేస్తుంటారు. ఇక్కడ 14 వరకు దుకాణాలు ఏర్పాటు చేసి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఒడిశా, హైదరాబాద్, బెంగళూరు, కటక్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు మామిడి కాయలు, పండ్లను కూడా ఎగుమతి చేస్తుంటారు. డిసెంబరు నుంచే ఇక్కడ కమీషన్ వ్యాపారులు తమ దుకాణాలు తెరిచి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలను కొనుగోలు చేయడం.. రైతులకు పెట్టుబడుల కోసం అడ్వాన్సులు చెల్లిస్తుంటారు. వేంపాడు, చినదొడ్డిగల్లు కాగిత ప్రాంతాల నుంచి ఏటా సీజన్ ముగిసే నాటికి సుమారు 20 నుంచి 30 వేల టన్నులకు పైగా మామిడి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. గతంలో రోజుకు 500 నుంచి 800 టన్నులు ఎగుమతి అయ్యేది. ఈ ఏడాది మాత్రం రోజుకు 100 నుంచి 200 టన్నులకు మించి ఎగుమతి చేయడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కొక్క దుకాణం నుంచి గతంలో 10 టన్నుల వ్యాన్లు రోజుకు పది వరకు పంపించే వారమని, ఇప్పుడు 3 టన్నుల సామర్థ్యం కలిగిన బొలేరో వాహనాలను రోజుకు పది మాత్రమే పంపించగలుగుతున్నామని వారు చెబుతున్నారు.

ధర సూపర్

ఈ ఏడాది మామిడి ధర చాలా బాగుంది. బంగిన పల్లి ధర టన్ను రూ.40 వేలు ఉంది. సువర్ణరేఖ రూ.50 వేల నుంచి 60 వేల వరకు ఉంది. కలెక్టర్ రకం రూ.23 వేల వరకు ఉంది. ఇక రసాలు, కోలంగోవా వంటి పండ్ల రకాల ధరలు రూ.35 వేలు పైబడే ఉంది.

పెట్టుబడులు రావడం కష్టమే..

పదెకరాల మామిడి తోటను ఏడాది ఫలసాయం కోసం రూ.1.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తారు. పురుగు మందులు పిచికారీ, ఎరువులు తదితర వాటి కోసం మరో రూ.50 వేల వరకు ఖర్చు చేస్తారు. తీరా ఇంత పెట్టుబడి పెట్టినా దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. వర్షాలు పడకపోవడం, పొగ మంచు, బొడ్డుపుచ్చు పురుగు కారణంగా దిగుబడి రాలేదని చెబుతున్నారు. వచ్చిన కాయలు కూడా నాణ్యతతో ఉండడం లేదని అంటున్నారు.

లీజు డబ్బులూ వచ్చేటట్టు లేదు..

లక్షల పెట్టుబడి పెట్టి మామిడి తోటలు లీజుకు తీసుకొన్నాం. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. లీజు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మామిడితో పాటు, జీడి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ ఏడాది పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కమీషన్ దుకాణాలకు కాకుండా టోకు పద్ధతిలో రైతుబజార్లకు వెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎస్.వి.రమణ, రైతు

ప్రతికూల పరిస్థితులతో నష్టాలు

ఏటా లక్షలాది రూపాయలు పెట్టి మామిడి తోటలు కొనుగోలు చేస్తున్నాం. కమీషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ప్రతికూల పరిస్థితుల వల్ల దిగుబడి రాక నష్టాలు చవిచూస్తున్నాం. దుకాణాలు ఏర్పాటు చేసి రెండు నెలలు గడుస్తున్నా వెయ్యి టన్నులు ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది.

– తోట సత్తిబాబు, మామిడి వ్యాపారి